




భీమేశ్వరాలయం వద్ద క్యూలైన్లో భక్తులు



మద్దికుంటలో..



తాడ్వాయి భీమేశ్వరాలయంలో..



కామారెడ్డిలో..

శంభో శివ శంభో



బండరామేశ్వర్‌పల్లిలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పూజలు

కామారెడ్డి టౌన్/సదాశివనగర్/తాడ్వాయి/మాచారెడ్డి/రామారెడ్డి/నాగిరెడ్డిపేట/నసురుల్లాబాద్/భిక్కనూరు, మార్చి 8: కామారెడ్డి జిల్లాలో శుక్రవారం శివరాత్రి ఉత్సవాలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే సమీపంలో ఉన్న శివాలయాలకు భక్తులు తరలివెళ్లారు. హరహర మహాదేవ శంభోశంకర, నీలకంఠేశ్వరా అంటూ లింగం చుట్టూ ప్రదక్షణలు చేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో మొదలుకొని సామూహిక అభిషేకాలు, రుద్రహోమాలు నిర్వహించారు. రాత్రి 11 గంటల నుంచి 12 గంటలకు లింగోద్భవ కాలం వరకు మహా ఆరతి ఇచ్చి మంత్ర పుష్పం, తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. రాత్రి జాగరణ తెల్లవారు వరకు భక్తులచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అతి పురాతనమైన క్షేత్రమైన శివకేశవాలయం, హౌసింగ్ బోర్డు కాలనీలో గల సంకష్టహర మహా గణపతి ఆలయం, ముదాంగల్లిలోని విశ్వేశ్వరాలయం, పంచముఖి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, గోపాలస్వామి రోడ్డులోని విఠలేశ్వరాలయంలో, ఐదుగుళ్ల ఆలయం, విద్యానగర్ శివాలయంలో, అశోక్‌నగర్‌లోని స్నేహపూరి కాలనీలో నీలకంఠేశ్వరాలయంలో, హౌజింగ్‌బోర్డు కాలనీలోని శారదాదేవి ఆలయంలో, ఇల్చిపూర్ సరస్వతీమాత ఆలయంతో పాటు కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లి రాజరాజేశ్వర ఆలయం, అడ్లూర్ ఎల్లారెడ్డిలోని వీరభద్రేశ్వరస్వామి ఆలయం, సదాశివనగర్ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, దగ్గి శివాలయం, మల్లన్నగుట్ట శివాలయం, అమర్లబండలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంతో పాటు ఆయా గ్రామాల్లో శివపార్వతుల కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించడంతో పాటు మహిళలు అమ్మవారికి ఓడి బియ్యం పోసి మొక్కులు చెల్లించారు. రాత్రి స్వామివారి పల్లికిసేవలు భజన కీర్తనలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాల్వంచ మండలంలోని బండరామేశ్వర్‌పల్లి గ్రామంలో శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కళ్యాణమహోత్సవం కన్నుల పండుగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ఓడిబియ్యం పోసి మొక్కులు సమర్పించారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు, పల్వంచ మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పల్లె రమేష్‌గౌడ్ స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తాడ్వాయి మండలంలోని సంతాయిపేట భీమేశ్వరాలయంలో చుట్టు పక్కల మండలాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆలయం పక్కనే ఉన్న వాగులో భక్తులు స్నానాలు ఆచరించి పూజలు నిర్వహించారు. చిట్యాల, కృష్ణాజీవాడి గ్రామాల్లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి, దేమికలాన్‌లోని పార్వతిదేవి, తాడ్వాయిలోని శబరిమాత తదితర ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామారెడ్డి మండలంలోని మద్దికుంట అటవి ప్రాంతంలో వెలసిన శ్రీ స్వయంభూ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం, భిక్కనూరులో సిద్ధరామేశ్వర ఆలయంలో స్వామి వారి కల్యాణంతో పాటు పూజా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే భక్తులతో ఆలయమంతా కిటకిటలాడింది. కాకతీయనగర్‌లోని ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్ దర్శించుకున్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని తాండూరు గ్రామ శివారులో గల త్రిలింగ రామేశ్వరాలయంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, కలెక్టర్ జితేష్ పాటిల్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం నిర్వహించారు. నసురుల్లాబాద్ మండలంలోని దుర్కి శివారులోని సోమలింగాల దేవస్థానంలో మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి - పుష్ప దంపతులు పూజలు నిర్వహించారు.





అడ్లూర్ ఎల్లారెడ్డిలో శివపార్వతుల కల్యాణం



తాండూరు త్రిలింగేశ్వరాలయంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కలెక్టర్



దుర్కి సోమలింగేశ్వర ఆలయంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతుల పూజలు



బండరామేశ్వర్‌పల్లిలో.



భిక్కనూరులోని సిద్ధరామేశ్వరాలయంలో..

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా సురేష్ షెట్కార్

- సురేష్ షెట్కార్ పేరును ప్రకటించిన పార్టీ అధిష్ఠానం
- జహీరాబాద్ ఎంపీగా నాలుగో సారి బరిలో ఉండనున్న షెట్కార్
- గతంలో రెండు పర్యాయాలు ఎంపీగా..
- తేలిన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థిత్వం
- బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరో?

కామారెడ్డి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ త్వరలో వెలువడనున్నందున జాతీయ పార్టీలు పోటాపోటీగా అభ్యర్థులను ఖరారు చేస్తున్నాయి. ఇప్పటికే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తొలి జాబితాను విడుదల చేయగా అందులో జహీరాబాద్ అభ్యర్థిని ప్రకటించింది. ఇక ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ శుక్రవారం ఎంపీ అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 36 మందితో కూడిన ఎంపీ అభ్యర్థులను ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. తొలి జాబితాలోనే జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిని ఆ పార్టీ ప్రకటించింది. అనుకున్న విధంగానే జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా సురేష్‌షెట్కార్‌కే మొగ్గు చూపింది. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి ఎంపీగా కాంగ్రెస్ తరఫున మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ బరిలో ఉండనున్నారు. కాంగ్రెస్ నుంచి పలువురు ఆశవాహులు జహీరాబాద్ ఎంపీ టికెట్‌కై ప్రయత్నించిన పార్టీ అధిష్ఠానం మాజీ ఎంపీ సురేష్ షెట్కార్‌కే మొగ్గు చూపింది. ఆయన పేరును ఖరారు చేస్తూ తొలి జాబితాలో విడుదల చేసింది.

జహీరాబాద్ నుంచి నాలుగో సారి బరిలో ఉండనున్న షెట్కార్

జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ నాలుగోసారి బరిలో దిగనున్నారు. గతంలో ఇదే స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున సురేష్ షెట్కార్ మూడు పర్యాయాలుగా పోటీ చేశారు. 2004లో జహీరాబాద్ ఎంపీగా పోటీ చేసిన షెట్కార్ ఎంపీగా గెలుపొందారు. అనంతరం 2009లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ పార్టీ అధిష్ఠానం షెట్కార్‌నే బరిలో దింపగా సమీప ప్రత్యర్థి అయిన టీఆర్ఎస్ అభ్యర్థి యూసుఫ్ అలీపై విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తరఫున సురేష్ షెట్కార్ బరిలో దిగి టీఆర్ఎస్ అభ్యర్థి బీబీ పాటిల్ చేతిలో ఓటమి పాలయ్యారు. 2019లో షెట్కార్ ఎంపీగా పోటీ చేసేందుకు సుముఖత చూపలేదు. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ప్రభుత్వంను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజక వర్గంల్లోంచి 4 సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. దీంతో జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ టికెట్‌కై పలువురు టికెట్ ఆశించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించే అవకాశాలు ఉండడంతో పార్టీ అధిష్ఠానం సైతం గెలిచే అభ్యర్థినే బరిలో దింపాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ సీనియర్ నాయకుడైన సురేష్ షెట్కార్‌నే జహీరాబాద్ నుంచి ఎంపీగా బరిలో దింపనుంది. ఈ ఎన్నికల్లో సురేష్ షెట్కార్ విజయం సాధిస్తారా లేదా చూడాలి.



సురేష్ షెట్కార్

బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరో?

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటిస్తూ వస్తున్నాయి. ఇప్పటికే జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు జహీరాబాద్ ఎంపీ అభ్యర్థులను ప్రకటించాయి. గత వారం రోజుల కిందటే బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ బీబీపాటిల్‌ను ఖరారు చేసిన విషయం తెలిసిందే. సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి గెలుపొందగా పక్షం రోజుల కిందట బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. చేరిన మరుసటి రోజే పార్టీ అధిష్ఠానం బీబీ పాటిల్ అభ్యర్థిత్వాన్ని ఖారారు చేసింది. తాజాగా కాంగ్రెస్ సైతం దేశవ్యాప్తంగా 36 మంది ఎంపీ అభ్యర్థులను ప్రకటించగా తెలంగాణ నుంచి నలుగురు అభ్యర్థులను ఖరారు చేసింది. తొలి జాబితాలోనే కాంగ్రెస్ జహీరాబాద్ అభ్యర్థిగా సురేష్ షెట్కార్ పేరును ఖరారు చేసింది. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనేది తేలాల్సి ఉంది. సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడంతో ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఎవరనేది పార్టీ క్యాడర్‌లోనూ అయోమయానికి గురి చేస్తోంది. బీఆర్ఎస్ నుంచి పలువురు ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి టికెట్ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనేది ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేస్తే గాని స్పష్టత రానుంది. బీఆర్ఎస్ అభ్యర్థిత్వం ఖరారు అయితే జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో రాజకీయం రసవత్తరంగా మారనుంది.



ఎల్లారెడ్డిలో పురాతన బావిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కలెక్టర్ జితేష్ వి. పాటిల్

పురాతన బావులను పునరుద్ధరించి

పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం : కలెక్టర్

ఎల్లారెడ్డి, మార్చి 8: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని 380 సంవత్సరాల క్రితం నాటి రామాలయం, గోపాలస్వామి మందిరం ఆవరణలో ఉన్న పురాతన బావులను శుక్రవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ జితేష్ పాటిల్ మాట్లాడుతూ పురాతన బావులను భావితరాలకు అందించాలనే నేపథ్యంలో పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఈ బావి వెలుగులోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. బావిని ప్రత్యేకంగా దృష్టి సారించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తానన్నారు. ఇటువంటి పురాతన కట్టడాలు మన నియోజకవర్గంలో ఉండటం చాలా అదృష్టమన్నారు. బావిని అద్భుతంగా పునర్నిమించే విధంగా చూస్తానని ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, ఆలయ ధర్మకర్త సిద్ది శ్రీధర్, సిద్ది ప్రకాష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయుల కాలం నాటి శిల్పాలని కాపాడుకోవాలి

- పురావస్తు పరిశీలకుడు ఈమని శివ నాగిరెడ్డి

కాకతీయుల కాలం నాటి శిల్పాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశీలకుడు ప్లీచ్ ఇండియా సీఈవో ఈమని శివనాగిరెడ్డి అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయ ఆవరణలో ఉన్న నంది విగ్రహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విగ్రహాలు కాకతీయుల కాలం నాటివి అని అపురూప శిల్పాలకు ఆదరణ కరువైందని, 13, 14వ శతాబ్దాల కాలం నాటి నంది విగ్రహాలు అని వాటిని కాపాడుకోవాలని అన్నారు. వీటి పొడవు నాలుగు అడుగుల ఎత్తు, మూడు అడుగులు నల్ల రాతిపై చెక్కిన నంది విగ్రహాలపై అలంకరణలు అద్భుతంగా అలనాటి శిల్ప కళకు అద్దం పడుతున్నాయని ఆయన అన్నారు. అద్భుతంగా ఉన్నటువంటి విగ్రహాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆయనతో పాటు రెయిన్ వాటర్ ప్రాజెక్టు ఎం.డి. కల్పన రమేష్, రామాలయం ఆలయ ధర్మకర్త సిద్ది శ్రీధర్ ఉన్నారు.

మహాశివరాత్రితో ముగిసిన శివ దీక్షలు



ఇరుముడితో బయల్దేరిన స్వాములు

మోస్రా,మార్చి8: మండల కేంద్రంలో 108రోజులు, 14రోజుల పాటు శివాదీక్ష చేపట్టిన స్వాముల దీక్షలు మహ శివరాత్రితో ముగిశాయి. భక్తిశ్రద్ధలతో శివా దీక్ష చేపట్టిన స్వాములు మాల విరమణ కొరకు వేములవాడ, శ్రీశైలం దేవస్థానాలకు బయల్దేరి వెళ్లారు.

జక్రాన్‌పల్లిలో ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామంలో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలను భక్తులు, ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని కలిగోట్ గ్రామంలో గల పుట్ట శివాలయాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకోవడానికి భక్తులు, ప్రజలతో పుట్ట శివాలయంలో భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ, వీడీసీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. జక్రాన్‌పల్లి, పడకల్, అర్గుల్, మునిపల్లినారాయణపేట్, లక్ష్మాపూర్, సికింద్రాపూర్, కేశ్‌పల్లి, చింతలూర్, బ్రహ్మణ్‌పల్లి, తొర్లికొండ, కొలిప్యాక్, అన్ని గ్రామాలలో పలు ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చు కున్నారు. ఉపవాస దీక్ష ఉన్న భక్తుల కోసం ఆలయంలో శనివారం అన్న దానం నిర్వహించనున్నారు. సికింద్రాపూర్‌లోని రాజరాజేశ్వరస్వామి ఆల యంలో, జక్రాన్‌పల్లి, అర్గుల్, మునిపల్లి శంకరుని ఆలయంలో, తొర్లి కొండ, పడకల్, వెంకటేశ్వరస్వామి ఆలయంలో, కొలిప్యాక్‌లోని లక్ష్మీనర్సిం హస్వామి ఆలయంలో భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

'కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణపై బీఆర్‌ఎస్ రాజకీయం చేయడం తగదు'

ఏర్గట్ల, మార్చి 8: రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణపై బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారంలో ఉన్నప్పటి నుండే వారి మధ్య గొడవలు జరుగుతున్నాయని, ఇప్పుడు కొత్తగా బీఆర్ఎస్ నాయకుడిపై దాడి చేశారంటూ ప్రెస్‌మీట్‌లు పెట్టి మరి కాంగ్రెస్ పార్టీపై, పార్టీ నాయకులపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దాడి జరిగిన రోజేదాడికి పాల్పడ్డ వారిపై కేసులు నమోదయ్యాయని, ఓటమిని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులపై అనవసరమైన ఆరోపణలు చేయడం మంచిది కాదని, ఇకపై ఇలాంటి నీచ రాజకీయాలు మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవ రెడ్డి, ఆడెపు గంగాప్రసాద్, గడ్డం జీవన్, ముస్కు మోహన్, రవి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏర్గట్లలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



సిరికొండలో భూమి పూజచేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ మార్చి 8 : సిరికొండలో గల లొంక రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. నియోజక వర్గం అభివృద్ధి పథకం నుంచి మంజూరైన నిధులతో సిమెంటు రోడ్డును నిర్మిస్తారని ఎమ్మెల్యే చెప్పారు. ఆలయం అభివృద్ధికి కోసం నిధులు సమాకూరుస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఆలాయ అభివృద్ధి కమిటి అద్యక్షులు సంతోష్, సభ్యులు, కాంగ్రెస్ నాయకులు బాకారం రవి,ఎర్రన్న, బాల్‌రాజ్‌నాయక్,బాకారం సంతోష్, చందర్,మల్లేష్, దేగం సాయన్న,ఆసీఫ్,మాజీ సర్పంచ్ సంజీవ్,మహేష్‌రెడ్డి, రాజేశ్వర్, రాజేందర్‌గౌడ్, శ్రీనివాస్,తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని ఉపాధ్యాయులు వెలికితీయాలి

మోపాల్: విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని ఉపాధ్యాయులు వెలికి తీయాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని శుక్రవారం కంజర్‌గ్రామ శివారులో ఉన్న మహాత్మజ్యోతిబాపూలే పాఠశాలలో రూ.19 కోట్లలతో నిర్మించిన అదనపు గదులను ఆయన ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాల కన్న ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాభ్యాసాన్ని అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదువుకునే విద్యార్థుల్లో ఎక్కువ శాతం గ్రామీణ ప్రాంతా యువకులే ఉన్నారన్నారు. ఈ పాఠశాలలో చదువుకున్న అనేక మంది ఉన్నతమైన స్థాయిలో ఉన్నారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగాలన్నారు.రాబోయే రోజుల్లో ప్రతీ మండలానికి అంతర్జాతీయ ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. గురుకుల పాఠశాలలో ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందన్నారు. అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఉన్నతమైన స్థాయికి ఎదుగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్సీవో సత్యనాత్‌రెడ్డి, ఆర్డీవో రాజేంద్రకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముప్పా గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, మునిపల్లి సాయరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాజకిషన్, పార్టీ అధ్యక్షుడు సాయరెడ్డి, సతీష్‌రెడ్డి, గంగాప్రసాద్, ప్రతాప్, పోశెట్టి, సతీష్‌రావ్, తదితరులు ఉన్నారు

నలంద పాఠశాల వార్షికోత్సవ వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పెర్కిట్, మార్చి8: మామిడిపల్లిలో గల నలంద పాఠశాలలో శుక్రవారం 20వ వార్షికోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈవో రాజగంగారాం పాల్గొని విద్యార్థులకు దిశనిర్దేశం చేశారు. కార్యక్రమానికి టీవీ అర్టిస్టులు బుల్లెట్ బాస్కర్, నరేష్, తదితరులు పాల్గొని అలరించారు. విద్యార్థిని విద్యార్థులు పలు సాంస్కృతిక జానపద నృత్యాలు చేస్తూ అలరించారు. పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్, 20ఏళ్లుగా ఆదరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు, పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు

ఆర్మూర్‌టౌన్ , మార్చి8: పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషాదారణలతో నృత్యలు, పాటలు పాడుతూ అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేంధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదుల్లో ఉత్తమంగా వ్యవహరించి శ్రద్ధతో ఏకగ్రాతతో ఉపాధ్యాయులు బోధించే విషయాలను తూచ తప్పకుండా విని విశ్లేషించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చందన, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగతి శీల మహిళా సంఘం నాయకులు

బోధన్‌రూరల్, మార్చి 8: కేంద్ర ప్రభుత్వం అనుసరించే మతోన్మాద ఫాసిస్టు చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రగతి శీల మహిళా సంఘం నాయకులు నాగమణి, బీపాషా బేగంలు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని తట్టికోటలో ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం అనుసరించే మతోన్మాద, ఫాసిస్టు చర్యలకు వ్యతిరేకంగా మహిళలందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళల హక్కులను లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో రెహానాబేగం, అరుణ,విజయలక్ష్మీ, విజయ, మల్లమ్మ, లక్ష్మీ,గంగామణి, బుజ్జిలతో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

● మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

సిరికొండ: అంతర్జాతీయ మహిళ దినోత్సవ పోరాటా స్ఫూర్తితో దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వ అనుసరిస్తున్న మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని ప్రగతి శీల మహిళ సంఘం ఆర్మూర్ డివిజన్ అధ్యక్షురాలు రమా శ్రామిక మహిళలకు పిలుపునిచ్చారు. సిరికొండ మండలం రావుట్ల గ్రామంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మానస అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో రమా మాట్లాడారు.మహిళలపై జరుగుతున్న అన్ని రకాల దాడులను ప్రతిఘటిద్దామని అన్నారు. సమాజంలో మహిళలపై ఇంట, బయట తీవ్ర వివక్షత కొనసాగుతుందన్నారు.పురుషాధిక్యత రాజ్యమేలుతుందన్నారు.స్త్రీని వ్యాపార వస్తువుగా మార్చిన నేటి సమాజంలో వివక్షతకు, స్త్రీని వ్యాపార వస్తువుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తు పెద్ద ఎత్తున పోరాటాలు చేయడానికి ముందుకు రావాలని రమా కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్,డివిజన్ నాయకులు దామోదర్,పీవోడబ్ల్యూనాయకులు జమున,స్వరూప,మౌనిక,మాధూరి,కవిత తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీ ప్రభుత్వం దేశంలో మత విద్వేశాలు రెచ్చగొడుతోంది

పెద్దబజార్: 2014నుంచి బీజేపీ ప్రభుత్వం దేశంలో మత విద్వేశాలు రెచ్చగొడుతూ ప్రజల్లో మత ప్రతిపాదికన చీలికలు తెచ్చి మెజార్టీ ఓట్లు దండుకోవడానికి ప్రయత్నాలు చేస్తోందని పౌరహక్కుల సంఘం నాయకులు ఆల్గోట్ రవీందర్ ఆరోపించారు. నగరంలోని కోటగల్లీలో గల ఎన్ఆర్ భవన్‌లో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పౌరహక్కుల సంఘం 50వసంతాల సభలను ఈనెల 9,10తేదిల్లో హైదరాబాద్‌లోని సుందరయ్యభవన్‌లో జరుగుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రావ్, బీక్‌సింగ్, జలందర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పాలన అస్తవ్యస్తం..!



కారేగాం మంచినీటి పథకంలో నాచు పేరుకుపోయిన దృశ్యం



కొడిచర్లలలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త



జల్లాపల్లిలో రోడ్డు పక్కన నిలిచిన మురికి నీరు

కోటగిరి,మార్చి8: గ్రామ సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం గెజిటెడ్ స్థాయి అధికారులను గ్రామ ప్రత్యేక అధికారులుగా నియమించింది. ప్రస్తుతం తహసీల్దార్‌లు, ఎంపీడీవో, ఎంపీవో, ఆయా శాఖల్లో గెజిటెడ్ అధికారులను నియమించింది. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో అధికారులను బదిలీ చేయడంతో గ్రామీణ ప్రాంతాలలో పాలన గాడి తప్పుతోంది. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో, ఎంపీవోతో కలిసి 15రోజులకు లేదా నెలకోసారి గ్రామసభలు నిర్వహించాల్సి ఉంది. గ్రామసభల్లో సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంతో పాటు అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. అధికారులకు పని ఒత్తిడి వల్ల గ్రామాలలో పాలన కుంటుపడుతుంది.

● ఇది సంగతి

కోటగిరి ఉమ్మడి మండలంలో 28గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారు సొంత శాఖతో పాటు తమకు కేటాయించిన మూడు నుంచి నాలుగు గ్రామాల బాధ్యతలను పంచాయతీ కార్యదర్శుల భాగస్వామ్యంతో నిర్వర్తిస్తున్నారు. సర్పంచ్‌లకు ఉండే బాధ్యతలు ప్రత్యేక అధికారులకు అప్పగించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పారిశుద్యం, మంచినీటి సరఫరా, ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించడం ఇబ్బందులు తప్పడం లేదు. చాలా చోట్ల పంచాయతీ కార్యదర్శులు మధ్యాహ్నం నుండి అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

● వేసవిలో నీటి ఎద్దడి తీరేనా

పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారులకు జాయింట్ చెక్ పవర్ రాకపోవడంతో పారిశుద్యం, వీధి దీపాలు తదితర నిర్వహణ ఖర్చులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జాయింట్ చెక్ పవర్ ఇచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో గ్రామాలలో సమస్యలు పరిష్కరించడం సవాలుగా మారుతుంది. ప్రస్తుతం వేసవికాలం సమీపించడంతో గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తె అవకాశం ఉంది. తాగునీటి సమస్య పరిష్కారానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా గిరిజన గ్రామాలలో సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. సుద్దులం తండా, బర్దీపూర్ తండాతో పాటు పలు గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. పలు గ్రామాల్లోనూ తాగునీటి సమస్యతో పాటు పారిశుద్యం సమస్యలు పరిష్కరించేందుకు నిధులు కొరత తలెత్తుతోంది. కోటగిరి, పొతంగల్ మండల కేంద్రాల్లోతో పాటు ఎత్తొండ, హంగర్గ ఫారం గ్రామాలలో పారిశుద్య, తాగునీటి సమస్యలు తలెత్తె అవకాశం ఉంది. పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికకారులు దృష్టి సారించి గ్రామాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

పండుగ పూట విషాదం



రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

ఆర్మూర్‌రూరల్, మార్చి8: ఆర్మూర్ ప్రాంతంలో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాలలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. పండగ పూట వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని జక్రాన్‌పల్లి మండలం గన్యతాండాకు చెందిన ముగ్గురు యువకులు గోదావరి స్నానానికి వెళ్ళి శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో గల్లంతు కావడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. గన్యతాండాకు చెందిన అజ్మీర సాయినాథ్, అజ్మీర మున్నా అలియాస్ సాయికిరణ్, బానవత్ లోకేష్‌తో పాటు మరో ముగ్గురు అద్దె కారులో పోచంపాడ్‌కు గంగస్నానానికి వచ్చినట్లు సమాచారం. లక్ష్మీకెనాల్ వద్ద వారు స్నానాలు చేసిన అనంతరం శివాలయాన్ని దర్శించుకునే ఉద్దేశంతో వచ్చినట్లు తెలిసింది. ముప్కాల్ శివారులోని లక్ష్మీకాలువ రెగ్యులేటర్ వద్ద స్నానానికి దిగిన వారు మృతి చెందారు. వీరిలో అజ్మీర మున్న, సాయినాథ్ ఇంటర్ చదువుతుండగా, బానవత్ లోకేష్ హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గోదావరి తీరంలో వేసవిలో పంట పొలాలకు మట్టిని తరలిస్తుంటారు. మట్టిని తీసే క్రమంలో పెద్ద గుంతలు ఏర్పడడంతో నీటిలోతు ఎక్కువ ఉంటుంది.. ముందుగా ఒకరు స్నానం చేయడానికి దిగి ఈత రాకపోవడంతో నీట మునుగుతుండగా ఇద్దరు స్నేహితులు ఆయనను కాపాడడానికి ప్రయత్నించి వారు కూడా నీటిలో మునిగిపోయారు. మరో ముగ్గురు స్నేహితులు భయపడి అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకు మృతి

వేల్పూర్ మండలం అంక్సాపూర్ వద్ద శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు మృతి చెందడం వారి కుటుంబంలో విషాదాన్ని నింపింది. దొన్కల్ గ్రామానికి చెందిన మాడవేటి రవీందర్ ఆర్మూర్‌లో ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకునే నిమిత్తం తన కుమారుడు శివరాజ్‌తో కలిసి వస్తుండగా అంక్సాపూర్ శివారులో ప్రమాదం ఆగివున్న లారిని ఢీకొన్న ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా తన వాహనాన్ని ఏలాంటి సూచికలు పెట్టకుండా రోడ్డుపై నిలపడంతో రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిశాయి. జాతీయరహదారులపై వాహనాలు నిలిపే సమయంలో సూచికలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించినప్పటికీ వాహనదారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అమాయకులు బలవుతున్నారు.

'ప్రభుత్వ ఉద్యోగులపై హరీష్‌రావ్ వ్యాఖ్యలు అభ్యంతరకరం'

నిజామాబాద్‌అర్బన్,మార్చి 8: రైతుబంధు డబ్బులు ఆపి ఏసీ రూంల్లో కూర్చునే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు చెల్లించిందని మాజీ మంత్రి హరీష్‌రావ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతకరమని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణా రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడిన ఉద్యోగులను అవమానించే విధంగా హరీష్‌రావ్ వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వెంటనే ఉద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఎండి.జమీలుల్లా, ప్రధానకార్యదర్శి రమణచారి, మహిళ అధ్యక్షరాలు శివనాగమణి, రాష్ట్ర బాధ్యులు గంట్యాల ప్రసాద్‌లు ఒక ప్రకటనలో హరీష్‌రావ్ వ్యాఖ్యలను తప్పుపట్టారు.హరీష్‌రావ్ వ్యాఖ్యలు ఉద్యోగుల మనోభావాలను కించపర్చే విధంగా ఉన్నాయని ఎస్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ధర్మేందర్,శ్రీకాంత్‌లు ఒక ప్రకటనలో తప్పు పట్టారు.

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వ రైతులకుందించే రైతుబంధు పథకాన్ని ఆపి ఏసీరూముల్లో కూర్చునే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తూన్నదని మాజీ మంత్రి హరీష్‌రావు చేసిన వ్యాఖ్యను టీఎస్ పీఆర్టీయూ కమ్మర్‌పల్లి మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొద్దుటూరి చంద్రశేఖర్, అంజద్‌సుల్తాన్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంత్రి వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతకరంగా ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికోసం నిరంతరం పాటుపడుతున్న ఉద్యోగులను హరీష్‌రావు వ్యాఖ్యలు అవమానించడమేనన్నారు. రైతుబంధుకు తాము వ్యతిరేకులంకాదని కాని ఉద్యోగుల జీతాలకు, రైతుబంధుపథకానికి సంబంధం ఏంటని ప్రశ్నించారు గతల ప్రభుత్వం ఉద్యోగుల జీతాలపై దుష్ప్రచారం చేసి ప్రజల్లో ఉద్యోగులపట్ల వ్యతిరేకతను తిసుకువచ్చేప్రయత్నం చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం హరీష్‌రావు వ్యాఖ్యలు అదే తరహాలో ఉన్నాయన్నారు.గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా ఇప్పటివరకు ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన పలు సమస్యలు పెండింగ్‌లోనే ఉండిపోయాయని బాడా కాంట్రాక్టర్‌కు మాత్రం బిల్లు మంజూరీ చేసి న చరిత్ర అప్పటి ఆర్థికశాఖ మాజీ మంత్రి హరీష్‌రావుదేనని ఆరోపించారు. జీతాలు సరైన సమయానికి రాక బ్యాంక్ రుణాలు, ఇత్రాత్ర ఈఎంఐలు ఫైన్‌లతో చెల్లించామని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం దీన్ని సవరిస్తుంటే ప్రజలను రైతులను ఉద్యో గుపై ఉసిగొల్పుతు ప్రయోజనం పొందాలని యేచించడం బాదాకరమని పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా మండలాల బాద్యులు రాజేశ్వర్ గౌడ్, బాల్‌రాజ్, శ్రీనివాస మూర్తి, రాధాకిషన్, గణేష్, జ్ఞానేశ్వర్, రోహిత్, మంజుల, వర్ష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



విద్యుత్ లైట్లలో వెలిగిపోతున్న కాశీ విశ్వనాథ ఆలయం

డిచ్‌పల్లి, మార్చి 8: హర హర శివ శివ శంభో శంఖర అంటూ భక్తులు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం తెల్లవారు జామున నుంచి రాత్రి వరకు ఆలయాల ప్రాంగణాలు శివ నామస్మరణలతో మార్మోగాయి. భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని స్ఫటిక లింగేశ్వర స్వామి శివాలయంలో ఉదయం నుంచే భక్తుల రాక ప్రారంభం అయింది భక్తులు శివునికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆలయానికి రంగురంగుల విద్యుత్ లైట్లు అమర్చడంతో విద్యుత్ కాంతులతో మెరిసిపోతుంది. ధర్మారం (బి) బ్రహ్మంగారి ఆలయంలో గల శివాలయం లో గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగ సముద్రం గ్రామ శివారులో గల శివాలయంలో పూజలు చేసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాయంత్రం రథోత్సవ కార్యక్రమం జరిగింది. సుద్దపల్లి శివాలయం, బొమ్మల గుడి విజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఏడో పోలీస్ బెటాలియన్ కమాండెంట్ రాంప్రకాశ్ దంపతుల హాజరై ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. లింగ సముద్రం గ్రామంలో జరిగిన రథోత్సవ కార్యక్రమానికి చుట్టూ పక్క గ్రామాల ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

మాక్లూర్‌లో..

మాక్లూర్ : మండలంలోని ఆయా గ్రామాల్లో పలు శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలను శుక్రవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచి శివాలయాల వద్ద బారులు తీరి తమ మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం ఆయా ఆలయాలలో నిర్వాహకులు అన్నదానం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.



మామిడిపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సమాజాన్ని మార్చే శక్తి మహిళలకు ఉంది



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ గుప్తా



మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ గుప్తా

పెద్దబజార్ ,మార్చి 8: సమాజాన్ని మార్చే శక్తి మహిళలకు ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ మహిళల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మారుతినగర్‌లో ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలకు గౌరవం ఇవ్వకుండా సంవత్సరానికి 365రోజులు గౌరవిస్తే మహిళలపై గౌరవం పెరిగి అత్యాచారాలు తగ్గుతాయని అన్నారు. ప్రధాని మోదీ మహిళలకు గౌరవిస్తూ సుకన్యసమృద్ధి యోజన కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. అంతే కాకుండా ముస్లింమహిళలపై త్రిపుల్‌తలాఖ్ రద్దు చేసి వారికి గౌరవాన్ని కల్పించారన్నారు. సమాజంలో నీచమైన రాజకీయ నాయకులు కొందరు మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు వారం రోజుల కితం పక్క జిల్లా నిర్మల్‌లో జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఆర్యవైశ్య సంఘం మహిళలు పాల్గొన్నారు.

● బొప్పాపూర్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

రుద్రూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రుద్రూరు మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్, గ్రామ అధ్యక్షుడు దత్తుల ఆధ్వర్యంలో మహిళలను శాలువాతో సన్మానించి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కొరకు చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రుద్రూరు మండల ఉపాధ్యక్షుడు నడిపింటి నగేష్, నిజామాబాద్ జిల్లా ఓబీసీ సెల్ కార్యదర్శి పట్ల సురేష్, దువ్వ రవి, భూమన్న, సుదర్శన్‌గౌడ్, శ్రావణ్, కృష్ణ, కుర్మాజీ సాయిలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● రుద్రూరులోని ఆహార శాస్త్ర సాంకేతిక కళాశాలలో..

రుద్రూరులోని ఆహార శాస్త్ర సాంకేతిక కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఇన్‌చార్జి సమ్రీన్, కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్‌వెంకటరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● మహిళలను సన్మానించిన పీడీఎస్‌యూ నాయకులు

డిచ్‌పల్లి: అంతర్జాతీయ మహిళ దినోత్సవంసందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వర్సిటీలో పనిచేస్తున్న మహిళ సిబ్బందిని శాలువలతో సన్మానించి మహిళ ప్రాముఖ్యతను తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ వర్సిటీ కార్యదర్శి జయంతి మాట్లాడుతూ.. మహిళలు కుటుంబ పోషన కోసం ఇంట్లో మరియు బయట ఎంతో కష్టపడుతున్నారని వర్సిటీలో మహిళ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చాలిచాలని వేతనాలతో పనులు చేస్తున్నారని ప్రభుత్వం వారికి వెంటనే కనీస వేతనం తో పాటు రెగ్యూలరైజ్ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ వర్సిటీ నాయకులు నవ్య, అనూష, బిందు, పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండలంలోని బర్దిపూర్ గ్రామంలో గల సీఎస్ఐ వెస్లీ చర్చిలో శుక్రవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపి బైబిల్ లోని స్త్రీలకు గుర్చి సంఘ కాపరి రెవ జి దినాకర్ సందేశం అందించారు. ఈ సందర్భంగా స్త్రీలను ఘనంగా సన్మానించారు. స్త్రీలు దైవ భక్తి, కుటుంబం పట్ల బాధ్యత చైతన్య వంతులు అయి ఉండాలని కాపరి బోధించారు. ఈ కార్యక్రమంలో ఇందిరా, కృప, శోభమ్మ, శీరిష, దేవరాజు, దేవరాజు, ప్రభాకర్, పౌలు, ప్రకాశం, తదితరులు పాల్గొన్నారు.

మహిళ వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

ఆర్మూర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వ మహిళ వ్యతిరేక విధానాలను పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకుందామని సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా సహాయకార్యదర్శి దాసు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని మామిడిపల్లిలో మహిళ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత మాతకు జై అంటునే బేటి బచావో బేటి పడావో నరేంద్రమోదీద నినాదిస్తూనే ప్రతీరోజు వందలాది మంది ఆడ పిల్లల ఉసురుపోసుకుంటున్నారన్నారు. ప్రేమోన్మాధంతో దాడులు నిత్యకృత్యం అయ్యాయని, 33శాతం రిజర్వేషన్ అమలు ఇంకెప్పుడు అని ఆయన పాలకులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యు నాయకురాలు మమ్మది, లలిత, గంగక్క, నర్సవ్వ లక్ష్మీ, కాలేద, షహద, పతిమాబేగం, తదితరులు పాల్గొన్నారు.

రేపు కామారెడ్డికి కేటీఆర్ రాక

● కామారెడ్డి జిల్లా కేంద్రంలో విస్తృత స్థాయి సమావేశం

కామారెడ్డి టౌన్, మార్చి 8: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్య గార్డెన్ లో ఆదివారం కామారెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజిబుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

.. శ్రామిక మహిళా అంతర్జాతీయ దినోత్సవం

కామారెడ్డి టౌన్, మార్చి 8: టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రామిక మహిళా అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాత రాజంపేటలోని లేపాక్షి హోమ్‌లో గల కమ్యూనిటీ హాల్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీపీటీఎఫ్ మహిళ విభాగం ప్రతినిధులు నళినిదేవి, మీనా భూషణ్‌లు తెలిపారు. 'సామాజిక బాధ్యత' అనే అంశంపై చర్చా గోష్టి నిర్వహించనున్నామన్నారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యురాలు సుమిత్ర ఆనంద్, డాక్టర్ తేజస్విని, డాక్టర్ రవళి హాజరవుతున్నారని తెలిపారు. పెద్ద ఎత్తున మహిళా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

టేకు కట్టెల స్వాధీనం

రామారెడ్డి, మార్చి 8: మండలంలోని గిద్ద గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన వడ్డ శంకర్ వద్ద 31 టేకు కట్టెలను గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు అటవీశాఖ సెక్షన్ అధికారి శేఖర్ తెలిపారు. ఈ అక్రమంగా నిల్వ ఉంచినందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

ఆటో, లారీ ఢీ కొని ఒకరి మృతి

మద్నూర్, మార్చి 8: మండలంలోని సోనాల గ్రామ సమీపంలో మూల మలుపు వద్ద ప్రయాణికులతో వెళుతున్న ఆటోను ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టగా, ఆటో బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు గాయాలు కాగా లింబూర్ గ్రామానికి చెందిన చందు(28) అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించామన్నారు.

తాగుడుకు బానిసై భర్తను చంపిన భార్య

మద్నూర్, మార్చి 8: డోంగ్లి మండల కేంద్రంలో మష్నాజీ గత కొంత కాలంగా తాగుడుకు బానిసై ఇంటికి రాగానే భార్యతో గొడవ పడేవాడని, తరచుగా గొడవలు జరుగుతుండటంతో విరక్తి చెందిన భార్య మలన్ బాయి తన మేనళ్లులు ఇద్దరు, మరో వ్యక్తితో హత్యకు ప్లాన్ చేసి గురువారం మధ్యాహ్నం డోంగ్లిలోని తన ఇంట్లో మృతుడిపై కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేయగా అపస్మారక స్థితిలో వెళ్లిన మష్నాజీని ఆస్పత్రికి తీసుకెళుతుండగా, మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలాన్ని బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ సందర్శించి, వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.



బీర్కూర్‌లో ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ మేనిఫెస్టో కోసం ప్రజాభిప్రాయ సేకరణ

బీర్కూర్, మార్చి 8 : వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ మేనిఫెస్టో తయారీ కోసం బీజేపీ నాయకులు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రచారరథంను ఏర్పాటు చేసి నియోజకవర్గంలో ప్రజా అభిప్రాయాలను సేకరించారు. దేశ ప్రజల కోసం ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎల్ఈడీ ద్వారా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ బీజేపీ నాయకులు సాయి కిరణ్, పోచుగొండ, రవి, సాయిబాబా, కార్యకర్తలు శంకర్, సంపత్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండలంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా నేరుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వికసిత్ భారత్ ద్వారా పోస్టు ద్వారా బాన్సువాడని జిల్లాగా చేయాలని, రైల్వేలైన్‌ఏర్పాటు చేయాలని, మెడికల్ కాలేజీ, ఇండస్ట్రీలు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సున్నం సాయిలు, కంది పెద్ద మల్లే ష్, కిషోర్, పర్వయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

నిజాంసాగర్, మార్చి 8: మండల కేంద్రంలో శుక్రవారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, లక్ష్మణ్‌దాస్, శ్రీనివాస్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడంతో పనులను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు చేపడుతున్న దృశ్యం



దోమకొండలో శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న గ్రామస్థులు



బీర్కూర్‌లో..



సోమలింగేశ్వరాలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

దోమకొండ, మార్చి 8: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం దోమకొండతో పాటు అన్ని గ్రామాల్లో ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. శివరాంమందిర్ ఆలయంలో ఉదయం నుంచి పూజ కార్యక్రమం, అభిషేకం, ఎదురుకోల్లు, గంగన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి కల్యాణోత్సవం, అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ అబ్రబోయిన రాజేందర్ తెలిపారు. శనివారం తెల్లవారుజామున స్వామివారి రథారోహణ, గంగన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, సీతారామచంద్ర స్వామి రథాలపై ఊరేగింపు, చక్కెర తీర్థం నాకబలి, అవబృద స్నానం, పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. గడికోటలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాంమందిర్, గడికోటలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కామినేని శోభన, అనిల్ కుమార్, దంపతులు వారి కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు.

బీబీపేట: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందాపూర్, యాడారం, మల్కాపూర్, తుజాల్‌పూర్, ఉప్పర్‌పల్లి గ్రామాలలోని శివాలయం, మార్కండేయ ఆలయాలలో శివరాత్రిపర్వదినాన్ని పురస్కరించుకుని పుష్పాలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు పోటెత్తారు. ఆలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. ఉపవాస దీక్షలు భజన కార్యక్రమాలు నిర్వహించారు.

బీర్కూర్: మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. బీర్కూర్ మండల కేంద్రంలోని జోడు లింగేశ్వర ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉపవాస దీక్షలతో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా అన్ని చోట్ల మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తుల తాకిడితో శివాలయాలు కిటకిటలాడాయి.

మద్నూర్: మండలంలోని శివాలయాల్లో తెల్లవారు జాము నుంచే బిల్వార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమ లింగాల ఆలయం వద్ద యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. భాగన్న మఠంలో శివనామ జపం నిర్వహించారు. సోమ లింగాల ఆలయం గ్రామానికి కిలో మీటర్ దూరంలో గుట్టపై ఉండటంతో భక్తులు ఆలయాన్ని దర్శించుకోవడానికి కుటుంబ సభ్యులతో కలిసి బయలుదేరివెళ్లారు. ఆలయం గ్రామానికి దూరంగా ఉండటంతో నిర్వాహకులు వచ్చిన భక్తుల కోసం పండ్లు, పలహారాలు అందజేశారు. మహా శివరాత్రి సందర్భంగా రాత్రంతా జాగరణ చేయడా నికి ఏర్పాట్లు చేశారు. శనివారం ఉపవాస దీక్షలు విరమించే వారి కోసం ఆయా ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండల కేంద్రాల్లోని శివాలయాలు శివ నామ సంకీర్తనలతో మారు మోగాయి. మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

పిట్లం: మండలంలోని రాజరాజేశ్వర ఆలయంలో భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజారి భస్వరాజ్ శివాలయంలో భక్తులతో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు

బాన్సువాడ టౌన్: మహాశివరాత్రి పర్వదినం రోజున భక్తులు చేసిన శివనామస్మరణతో పట్టణమంతా మారుమోగిపోయింది. ఉదయం నుంచే అర్చకులు శివలింగాలకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో చేరుకోవడంతో ఆలయాలు కిటకిటలాడాయి. పట్టణంలోని సంగమేశ్వరాలయంలో భక్తులు శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్ష చేపట్టారు. సంధ్యా సమయంలో శివార్చన చేసిన అనంతరం పాలు, పండ్లు స్వీకరించి ఉపవాస దీక్షను విరమించారు. రాత్రి వేళలో భజనలు చేస్తూ జాగరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు తదితరులున్నారు.

నిజాంసాగర్: ఉమ్మడి నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల్లోని శివాలయాలతో పాటు ఆయా దేవాలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉపవాస దీక్షలు విడువనున్నట్లు తెలిపారు.

పెద్ద కొడప్‌గల్: ప్రజలందరూ చెడు మార్గాన్ని వదిలి భక్తి మార్గంలో పయనించినప్పుడే భగవంతుని కృపకు పాత్రులు అవుతారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ పేర్కొన్నారు. శుక్రవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పాపనేశ్వర ఆలయంలో జరిగిన పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తి మార్గంలో ఉండాలంటే ముందుగా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గత పురాణాలలో చూస్తే కూడా ఎంతో మంది భక్తి మార్గం ద్వారా భగవంతున్ని కృపకు పాత్రులయ్యారని సూచించారు. మహా శివరాత్రి సందర్భంగా భక్తితో ఉండి దీక్షతో పూజలు చేస్తారో వారికి భోళా శంకరుడు వారిపై దయ చూపుతాడని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో 108 మంది దంపతులతో ఏర్పాటు చేసిన మహా రుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు శ్రీపథ్‌రావ్, వెంకట కృష్ణ, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: మహా శివరాత్రి పర్వదిన్నాన్ని పురస్కరించుకొని ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయంలో ఉదయం నుంచి భక్తులు అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అభిషేకం చేసి మొక్కులు చెల్లించుకుని పట్టు వస్త్రాలను సమర్పించారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బిందేర్ నుంచి నీలకంఠేశ్వర ఆలయం వరకు స్వామి వారిని ఊరేగించారు. మధ్యాహ్నం శివ పార్వతుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయానికి పట్టణ వివిధ ప్రాంతాల ప్రజలు భారీగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నా రు. సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపారాధన నిర్వహించారు.



బాన్సువాడలో..



నిజాంసాగర్‌లో..



పాపనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తోట

మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

మద్నూర్, మార్చి 8: ప్రభుత్వం మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, వారి కోసం వారంలో రెండు సార్లు ఆరోగ్య మహిళా కింద పలు పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తున్నట్లు వైద్యురాలు వెల్లడించారు. మహిళలు తాము ఆరోగ్యంగా ఉన్నప్పుడే తన కుటుంబాన్ని పరిరక్షించుకోగలుగుతుందని, డోంగ్లి పీహెచ్‌సీలో మహిళలకు పరీక్షలు నిర్వహించి, వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆయా గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

సృష్టికి మూలం స్త్రీ మూర్తి

బాన్సువాడ టౌన్: ఈ సృష్టికి మూలం స్త్రీమూర్తి అని, ఎక్కడైతే వారు గౌరవింపబడతారో అక్కడ దేవతామూర్తులుంటారని బాన్సువాడ పట్టణ సీఐ కృష్ణ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్లో మహిళలను ఆయన శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలను గౌరవించడం మన బాధ్యత అన్నారు. మహిళలకు అపాయమొస్తే వారిని కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రతీ పౌరుడిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.



కామారెడ్డిలో మహిళా సిబ్బందిని సన్మానించిన సీఐ



మహిళలను సన్మానిస్తున్న సీఐ కృష్ణ

మహిళల సేవలు అత్యుత్తమం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పోలీసుస్టేషన్ పరిధిలో పనిచేసే మహిళా కానిస్టేబుళ్లను శుక్రవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళల సేవలు అత్యుత్తమమని వారు లేకుండా సమాజాన్ని నిర్మించలేమని అన్నారు. మహిళలు పోలీసు వృత్తిని ఎంచుకుని పురుషులతో సమానంగా విధులు నిర్వహించడం ఆదర్శప్రాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీరాం, ఇంద్రసేనారెడ్డి, అనిల్, సిబ్బంది నాగలక్ష్మీ, గోదావరి, లావణ్య, రజిత, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పోచారానికి మాజీ జడ్పీటీసీ వెన్నుపోటు పొడిచారు

● బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

బీర్కూర్, మార్చి 8: పది సంవత్సరాల పాటు అధికారం అనుభవించి, కోట్లాది రూపాయల కాంట్రాక్టు పనులు చేసుకున్న మాజీ జడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వెన్నుపోటు పొడిచాడని ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సందీప్, బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలో ఎంపీపీ, ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ జడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ అనే నాయకుడు పదేళ్లు అధికారం అనుభవించి, కోట్లాది రూపాయల కాంట్రాక్టు పనులు చేసుకుని, అధికారం కోల్పోగానే పార్టీ మారేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టాడని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఆయన రాకను అడ్డుకోవడంతో బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను కాంగ్రెస్‌లోకి సాగనంపి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఆఖరి శ్వాస వరకు పోచారానికి తోడుగా ఉంటానని, తనకు ఎలాంటి పదవులు అక్కరలేదని టీటీడీలో వేంకటేశ్వర స్వామి, బైరాపూర్‌లో విఠలేశ్వర స్వామిలపై చేసిన ప్రమాణాలను మరిచిపోయావా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సందీప్, నాయకులు శశికాంత్, దుంపల రాజు, కొరిమే రఘు, అవారి గంగారాం, లాడేగాం గంగాధర్, లాయక్, గంగారాజులు గౌడ్, మన్నన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



బీర్కూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి

'కమీషన్లకు కక్కుర్తిపడి రోడ్డు పనులు చేయలేదు'

పిట్లం, మార్చి 8: మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే కమీషన్‌లకు కక్కుర్తి పడి గ్రామీణప్రాంతాల్లో రోడ్డు పనులు, అభివృద్ధి జరగక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని కాంగ్రెస్ నాయకులు న్యాయవాది రాంరెడ్డి అన్నారు. శుక్రవారం పిట్లంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నాయకులు రాంరెడ్డి మాట్లాడుతూ జుక్కల్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్‌పై గత రెండు రోజుల క్రితం విమర్శలు చేయడం సహించబోమన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పథకాలను చూసి ఓర్వలేక ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు భూమి పూజ

పెద్ద కొడప్‌గల్, మార్చి 8: పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో గల ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. అంతేగాక నిరుద్యోగుల కోసం నోటిఫికేషన్లు వేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని కొనియాడారు. కొడప్‌గల్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రహరీ నిర్మాణం కోసం ఉపాధి హామీ నిధుల నుంచి 32 లక్షల 58 వేల రూపాయలు మంజూరు కాగా పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటుగానే వంటగదుల నిర్మాణం కోసం 8లక్షల 80వేలు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం 7లక్షల 91వేల రూపాయలు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ పనులను పొందిన వారు పనులు నాణ్యతలోపించకుండా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, మోహన్, శ్యామప్ప పటేల్, సంజీవ్, కల్లూరి పండరి, వినోద్, రాంసింగ్, హన్మండ్లు, బచ్చన్, ఫిరోజ్, రషీద్ తదితరలు పాల్గొన్నారు.



ప్రహరీ నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే తోట



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్	- హనుమాన్
శాంతి	- గామి
ప్రియా 70	- భీమా
ప్రియా 35	- ఆపరేషన్ వాలెంటైన్

బాన్సువాడ

మహేశ్వరి	- భీమా
వెంకటేశ్వర	- గామి

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

